మీ గళం.. మా కలం...

# నమస్తే హైదరాబాద్

www.namasthehyderabad.in

తెలుగు దిన పత్రిక

రంగా రెడ్డి సంపుటి : 14 సంచిక :01 ఎడిటర్: గొడిశాల సోమయ్య గురువారం 05-06-2025 పేజీలు :8 వెల : 3 రూ



విలేకరులు కావలెను

నిత్యనూతనంగా వెలువడుతూ విశేష ప్రజాధరణ పొందుతున్న నమస్తే హైదరాబాద్ తెలుగు దినపత్రికకు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో విలేకరులు కావలెను

సీనియర్‌లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం

Ph: 9912580066


## కులగణనపై కేంద్రం కీలక నిర్ణయం



న్యూఢిల్లీ, జూన్ 04: దేశవ్యాప్తంగా కులగణనపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. 2027, మార్చి 1వ తేదీ నుంచి ఈ కులగణన చేపట్టాలని కేంద్రం బుధవారం నిర్ణయించింది. అయితే ఈ కులగణనను రెండు దశలుగా చేయాలని భావిస్తోంది. దీనితోపాటు జనగణనను సైతం చేపట్టాలని చూస్తోంది. 2026, అక్టోబర్ 1వ తేదీ నుంచి తొలి దశ చేపట్టనుంది. ఈ దశలో జమ్మూ కాశ్మీర్, లడఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో చేపట్టనున్నారు. మంచు ప్రభావం ఉన్న ఈ ప్రాంతంలో తొలుత ఈ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. 2027, మార్చి 1 వ తేదీ నుంచి రెండో దశలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన అధికారిక గెజిట్‌ను జూన్ 16వ తేదీన కేంద్రం విడుదల చేసే అవకాశం ఉందని కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

ూ%దేశంలో సామాజిక న్యాయం, సంక్షేమ విధనాలు, రాజకీయ ప్రాతినిధ్యం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొనేందుకు ఈ కుల గణన చేపట్టాలని వాదన చాలా కాలంగా దేశంలో బలంగా వినిపిస్తోంది. అయితే కులగణనపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు తొలుత ప్రస్తావించారు. ఆ క్రమంలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణల్లో సైతం ఈ కులగణన సర్వేను నిర్వహించారు. దీంతో కేంద్రంపై ఈ కులగణన సర్వే అంశం తీవ్ర ఒత్తిడి వచ్చింది. అయితే ఈ కులగణనపై మోదీ ప్రభుత్వం తొలుత నిరాకరించింది. కానీ ఈ కులగణన దేశవ్యాప్తంగా నిర్వహించాలంటూ అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తీసుకు వచ్చాయి. ఈ నేపథ్యంలో కులగణన చేపట్టేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో జనగణన చేపట్టినప్పుడు కులగణన కూడా చేపట్టాలని ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే.అసలు అయితే 2021లో జనగణన నిర్వహించాల్సి ఉంది. కానీ కరోనా విజృంభించడంతో.. ఆ సమయంలో ఈ జనగణన నిర్వహించలేదు. అయితే 2027లో జనగణనతోపాటు కులగణన సైతం నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది. అదీకాక 2029లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నాటికే ఈ కులగణనతోపాటు జనగణన చేపట్టాలని చూస్తోంది. అలాగే నియోజకవర్గాల పునర్విభజన సైతం జరగనుంది. ఆ ముందే ఈ గణన చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది.

## స్థానిక ఎన్నికలపై నేడు స్పష్టత!



2లో

## తెలుగు రాష్ట్రాలలో కోవిడ్ కలకలం..




హైదరాబాద్: దేశంలో కోవిడ్ కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. తాజాగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు వెలుగుచూస్తున్నాయి. కోవిడ్ కొత్త వేరియంట్లు ఎన్‌బీ.1.8.1, ఎల్‌ఎఫ్.7లను భారత్‌లో గుర్తించినట్లు ఇండియన్ సార్స్-కోవ్-2 జీనోమిక్స్ కన్సార్టియం ఇదివరకే వెల్లడించింది. ఇతర దేశాలతో పోలిస్తే.. దేశంలో వైరస్ వ్యాప్తి తక్కువగానే ఉన్నప్పటికీ జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో కరోనా కలకలం రేపుతోంది. కోవిడ్ చాపకింద నీరులా విస్తరిస్తోంది. కర్నూలు జిల్లాలో మరో ఇద్దరికి కొవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఓ ప్రొఫెసర్‌కు పరీక్షలు నిర్వహించగా.. కొవిడ్ నిర్ధారణ అయింది. నగరంలోని వెంకటరమణకాలనీకి చెందిన ప్రొఫెసర్ హెూం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు. అలాగే మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండాకు చెందిన 25 ఏళ్ల మహిళ అనారోగ్యంతో వారం రోజుల క్రితం కర్నూలు జీజీహెచ్‌లో చేరింది. ఆమెకు కరోనా పరీక్షలు చేయగా.. పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆమెకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో మూడు కోవిడ్ కేసులు నమోదు అయ్యాయి.

2లో

## మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



ఖమ్మం జిల్లా: ఇందిరమ్మ ఇళ్లలో అర్హులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో భాగంగా అందజేస్తున్నామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయని తెలిపారు. ఇవాళ(బుధవారం) ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల సత్యనారాయణపురంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా ఉండి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఆడబిడ్డ, తమ్ముడి కళ్లల్లో ఆనందాన్ని చూస్తుంటే భావోద్వేగానికి లోనవుతున్నామని

2లో

## చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో ఏడుగురు మృతి!



బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందగా.. మరికొంత మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని టీవీ9 కన్నడ రిపోర్ట్ చేసింది. ఐపీఎల్ 2025లో భాగంగా ఆర్సీబీ ట్రోఫీ గెలవడంతో వాళ్ల హెూం గ్రౌండ్ అయిన బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఈ రోజ సెలబ్రేషన్స్ ఏర్పాటు చేశారు. ఆర్సీబీ టీమ్ మొత్తం ఈ రోజు మధ్యాహ్నం బెంగళూరుకు చేరకుంది. తమ అభిమాన ఆటగాళ్లు, టీమ్ ట్రోఫీతో వస్తుంటే చూసి.. వారి అభినందించేందుకు స్టేడియానికి పెద్ద సంఖ్యలో వచ్చిన అభిమానులు ఒక్కసారిగా స్టేడియంలోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే తొక్కిసలాట చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.మంగళవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆర్సీబీ 6 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. 17 సీజన్లుగా కప్పు గెలవలేకపోయిన ఆర్సీబీ.. ఫైనల్‌గా 18వ సీజన్లో తమ తొలి ఐపీఎల్ ట్రోఫీ సాధించడంతో ఈ రోజు బెంగళూరులో సీఎం సిద్ధరామయ్య ఆర్సీబీ ఆటగాళ్లను సన్మానించే కార్యక్రమం పెట్టుకున్నారు. ముందు విధాన సౌధకు చేరుకొని.. అక్కడ సీఎంను కలిసి అక్కడి నుంచి చిన్నస్వామి స్టేడియానికి ర్యాలీగా వెళ్లాలి అనుకున్నారు. కానీ, పోలీసులు ర్యాలీకి అనుమతి ఇవ్వకపోవడంతో విధాన సౌధ నుంచి నేరుగా ఆటగాళ్లు స్టేడియానికి చేరుకోనున్నారు. అయితే ఆటగాళ్లు విధాన సౌధాకు వస్తున్నారనే విషయం తెలిసిందే. అభిమానులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో తొక్కిసలాట చోటు చేసుకుంది.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏడాది పాలనపై చర్చించిన మంత్రివర్గం.. ఇప్పటివరకూ సాధించిన లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. మంత్రులు ప్రజలకు మరింత దగ్గర కావాలని సీఎం చంద్రబాబు సూచించారు. అలాగే వనమహెూత్సవంతో పాటు యోగా డేను ప్రపంచ రికార్డ్ నెలకొప్పేలా నిర్వహించాలని నిర్ణయించింది. రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా సీఆర్డీఏ నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే పలు సంస్థలకు భూకేటాయింపులు.. ఉద్దానంలో రక్షిత మంచినీటికి నిధుల విడుదల సహా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేబినెట్ మీటింగ్ నిర్ణయాలను మంత్రి

2లో

## 2 విడతల్లో చేనేత అభయహస్తం

హైదరాబాద్, జూన్ 4 తెలంగాణ చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన 'తెలంగాణ చేనేత అభయ హస్తం' పథకం రెండు (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్, అక్టోబర్ నుంచి మార్చి వరకు) విడతల్లో అమలు చేస్తామని చేనేత కార్మికశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు 'తెలంగాణ చేనేత అభయహస్తం' పథకం మార్గదర్శకాలను జారీ చేశామన్నారు. వేతన ప్రోత్సాహం కింద ఏటా రూ.18 వేలు, అనుబంధ కార్మికులకు రూ.6,000 చెలిస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. ఒక్కో విడతలో చేనేత కార్మికుడికి

2లో

# సంపాదకీయం

ఇప్పుడు అంబేద్కర్ ఉంటే ఏం చేసేవారు?' అని 'డానీ' రాసిన వ్యాసం చూశాను (మే 24). అంబేద్కర్గూ, రాజ్యాంగమూ, హింసామార్గమూ– అనే విషయాల్లో, డానీ గమనించని సంగతులు కొన్ని ఉన్నాయనిపించి, ఇది రాస్తున్నాను.

(1) 'మావోయిస్టులది, ప్రకటిత హింసా మార్గం' –అన్నారు డానీ. మావోయిస్టులు హింసని ప్రయోగించిన సందర్భాల్ని గమనించవలిసిందే గానీ, వారి మార్గాన్నంతా హింసా మార్గంగానే భావించరాదని నా అభిప్రాయం.

అసలు చరిత్రలో, శ్రామికుల వర్గాన్ని అన్యాయంగా, బలప్రయోగంతో అణచడానికి దోపిడీ వర్గం ఏర్పర్చుకున్నదే రాజ్యాంగ యంత్రం! మానవ చరిత్రలో ప్రారంభం నించీ, శ్రమ దోపిడీ వర్గానిదే ప్రకటిత హింసామార్గం. అనాదిగా, బానిస యజమానుల కాలం నించీ ప్రారంభమైంది దోపిడీ వర్గ హింసా మార్గమే. ఆ హింసా మార్గాన్ని ఎదుర్కొని, పాలకవర్గాధికారాన్ని కూల్చివేసి, దోపిడీనించీ విముక్తి చెందడానికి, శ్రామిక వర్గానికి 'కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక' చూపిన మార్గం 'బలప్రయోగం'! ఆ మార్గంలో, ఆ వర్గం ఎన్ని అపజయాలు పొందినా, అదే దానికి స్వయం రక్షణ మార్గం. చరిత్రని చూస్తే, హింసని ప్రారంభించింది, దోపిడీ పీడనలకు గురి అయ్యే శ్రామిక జనాలు –అని చెప్పడానికి ఎక్కడా ఆధారాలు లేవు. ఈ కాలపు ఉదాహరణే తీసుకుంటే, చారెడైనా భూమిలేని కూలీలూ, కౌలు రైతులూ, 'దున్నేవాళ్ళకే భూమి' అనే నినాదంతో, కమ్యూనిస్టుల నాయకత్వంలో సిద్ధపడితే, ప్రభుత్వం ఊరుకోదు. బలప్రయోగంతో అణిచివేస్తుంది. అప్పుడు స్వయంరక్షణ కోసం కమ్యూనిస్టులు కూడా, తప్పనిసరై, హింసా మార్గాన్నే అనుసరిస్తారు. 'సాయుధ పోరాటమే ఏకైక మార్గం!', 'వర్గ శత్రువు రక్తంలో చేతులు ముంచనివాడు విప్లవకారుడే కాదు!' అనే తప్పుడు నినాదాల్ని, ప్రారంభకాలం నాటి మావోయిస్టు నాయకుడు చారుమజుందారు కూడా, మొదట్లోనే ఇవ్వలేదు. తెలంగాణ రైతాంగ పోరాటంలో గానీ, నక్సల్ బరీ పోరాటంలో గానీ, హింసని మొదట ప్రారంభించింది కమ్యూనిస్టులు కాదని చరిత్ర చెబుతోంది. కాబట్టి, 'మావోయిస్టులది ప్రకటిత హింసా మార్గం' అనడం న్యాయం కాదు.(2) 'భారత రాజ్యాంగం ఆధునిక పవిత్ర గ్రంథం' అనీ, ప్రభుత్వం చేసే హింస, ఆ పవిత్ర గ్రంథంలో ఉన్న 'ఆదర్శాలకూ, మార్గదర్శకాలకూ అనుగుణంగా' లేదనీ భావించారు డానీ. ప్రభుత్వం చేపట్టిన హింసామార్గాన్ని ఖండించడానికి, రాజ్యాంగాన్ని 'పవిత్ర గ్రంథం'గా వర్ణించనక్కరలేదు. వర్గాలుగా విడిపోయివున్న ఏ దేశంలో అయినా, రాజ్యాంగం అనేది, అక్కడ ఉండే ప్రభుత్వాలకు, ప్రత్యర్థుల్ని, ముఖ్యంగా విప్లవకారుల్ని అణచడానికి రకరకాల చట్టాల్ని అందుబాటులో ఉంచుతుంది. అసలు, ఒక సమాజంలో సైన్యమూ, పోలీసూ, రకరకాల సాయుధ బలగాలూ, ఆయుధాలూ, గూఢచారి వ్యవస్థ ఉన్నాయంటే, అవసరమైనప్పుడు, ఆ ప్రభుత్వాలు హింసా మార్గం అనుసరించడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అర్థం. అందుకే, ఇప్పటి సందర్భంలో, కగార్లనీ, బ్లాక్ ఫోరెస్టుల్నీ, డ్రోన్లనీ, రకరకాల పేర్లున్న అరడజను సాయుధ బలగాల్నీ ఉపయోగించడం! వీటిని ఉపయోగించకూడదని, డానీ చెప్పిన 'పవిత్ర రాజ్యాంగం'లో ఎక్కడా లేదు!

(3) 'ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సమానత్వాన్ని' సాధించడానికి ప్రభుత్వాలు ప్రయత్నించకపోతే, బాధితులైన ప్రజలు తిరగబడతారని రాజ్యాంగ రచనా కమిటీ చైర్మన్గా అంబేద్కర్ హెచ్చరించార'ని డానీ అంటున్నారు. అవును, ఆయన అలా అన్న మాట నిజమే! మరి, ఆయన అలా హెచ్చరించిన సమయంలోనే, 1948 సెప్టెంబరులో, తెలంగాణ గ్రామాలలోకి, కమ్యూనిస్టుల నాయకత్వాన నడుస్తున్న రైతాంగ పోరాటం ఒక రకమైన సమానత్వాన్ని కోరుతూ జరుగుతున్నదే గదా? మరి అలాంటి బాధితుల పోరాటాన్ని అణచడానికి, 50 వేల సైన్యాన్ని పంపిన ప్రభుత్వంలో అంబేద్కర్ ఒక మంత్రిగా ఎలా ఉండగలిగారు? ఇప్పటి ప్రభుత్వం అనుసరిస్తున్న హింసా మార్గాన్ని ఖండించడానికి, అణచివేత చట్టాలకూ, సాయుధ బలగాలకూ వీలునిచ్చిన రాజ్యాంగాన్ని తయారుచేసిన రచనా కమిటీలో ఉన్నవ్యక్తి మాటల్ని ఉటంకించడం వల్ల, పాఠకులు అటు రాజ్యాంగాన్ని గానీ, ఇటు ఆ వ్యక్తిని గానీ, సరిగా అర్థం చేసుకోవడం వీలు కాదు. ఆనాడే, రైతాంగం మీదా, వారి తరఫున పోరాడుతున్న కమ్యూనిస్టుల మీద, తన ప్రభుత్వమే హింసాకాండ జరుపుతున్నప్పుడు, ఏమి చెయ్యని అంబేద్కరు, ఇప్పుడు జరుగుతున్న హింసని చూసి 'ఏమి చేసేవాడో' అని ప్రశ్నించడం తార్కికంగా లేదు.

# స్థానిక ఎన్నికలపై నేడు స్పష్టత!

హైదరాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలపై గురువారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనే దానిపై మంత్రివర్గ సమావేశంలో కీలక చర్చ జరగనున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం.. స్థానిక ఎన్నికలు జూలైలో ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. క్యాబినెట్లో ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు ఉద్యోగులు లేవనెత్తిన అంశాలు, వ్యవసాయ సీజన్ సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా అంశాలపైనా చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఉద్యోగుల డీఏలు, ఆర్థికేతర అంశాల పరిష్కారంపై ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చింది. ఈ అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించి నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టంలో పలు సవరణలు చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. మొత్తంగా క్యాబినెట్ భేటీలో కీలక అంశాలు ఎజెండాగా ఉండనున్నాయి. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మంత్రిమండలి కీలక చర్చ జరపనున్నట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అ?ధికారంలోకి వచ్చిన రెండు నెలలకే గ్రామపంచాయతీలతోపాటు ఆ తరువాత వరుసగా మండల పరిషత్లు, జిల్లా పరిషత్లు, కొన్ని మునిసిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. వీటిలో సర్పంచ్ల పదవీకాలం 2024 ఫిబ్రవరికే ముగియగా.. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. సర్పంచ్లు లేకపోవడంతో పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు దాదాపు రూ.1,600 కోట్ల వరకు నిలిచిపోయాయి.

# తెలుగు రాష్ట్రాలలో కోవిడ్ కలకలం..

కరోనా నిర్ధారణ అయిన ఎమ్మిగ నూరు మండలం కలుగోట్ల రోగిని పాతగైనిక్ విభాగంలోని కోవిడ్ వార్డుకు తరలించారు. మంగళవారం మధ్యాహ్నం మళ్లీ ఆ రోగిని వీఐపీ నెగిటివ్ ప్రెజర్ రూంకు తరలించారు. పాత గైనిక్ విభాగంలోని కోవిడ్ వార్డుకు బాత్రూంలు లేకపోవడంతో రోగిని తరలించినట్లు సిబ్బంది చెబుతున్నారు. పాత గైనిక్ విభాగంలో కోవిడ్ వార్డు ఆవరణలో ఫిమేల్ మెడికల్ వార్డులు ఉన్నాయి. అక్కడ మహిళా రోగులు ఉన్నచోట కోవిడ్ వార్డును ఎలా ఏర్పాటు చేస్తారని బంధువులు మండిపడుతున్నారు. రెండు రోజులుగా కోవిడ్ రోగిని అటు ఇటు తిప్పుతుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కరోనా కేసులు పెరుగుతున్న దృష్ట్యా అధికారులు స్పందించి ప్రత్యేక కోవిడ్ వార్డును అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.

# మంత్రి పొంగులేటి కీలక ప్రకటన

చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే మంచి పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు. పది సంవత్సరాల్లో మాజీ సీఎం కేసీఆర్కి రేషన్ కార్డులు కూడా ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం లేదని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 19 లక్షల మంది పేర్లను కొత్తగా రేషన్ కార్డులో జమచేశామని ప్రకటించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని గత కేసీఆర్ ప్రభుత్వంలో అప్పుల్లోకి నెట్టారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధనిక రాష్ట్రంలో రూ.8 లక్షల 19 వేల కోట్ల అప్పు చేసి పోతే.. ప్రతి నెల రూ.6,500 కోట్ల వడ్డీని తమ ప్రభుత్వం కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మాదిరిగా పేదోళ్ల గురించి మొసలి కన్నీరుని ఇందిరమ్మ ప్రభుత్వం కార్చబోదని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మండిపడ్డారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

ఊకదంపుడు ఉపన్యాసాలు, కాలయాపన చేసే కబుర్లు చెపితే ప్రజలు నమ్మరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబ సభ్యులు కట్టుకున్న ప్యాలెస్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు నివసించే బంగ్లాల మీద పెట్టిన ఖర్చు, శ్రద్ధ పేదవారి ఇంటి మీద ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూపాయి ఖర్చు పెడితే రాజకీయంగా ఏం లాభం వస్తోందనే ఆలోచించారని అన్నారు. పేదవారికి ఖర్చు పెట్టె ప్రతి రూపాయి వారికి అందుతుందా లేదా అని కూడా కేసీఆర్ కనీసం ఆలోచించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

# ఘట్కేసర్ లో డాగ్ స్క్వాడ్ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



**ఘట్కేసర్ జూన్ 4 (నమస్తే హైదరాబాద్)** మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మున్సిపల్ పరిధిలో కమిషనర్ ఆఫ్ రాచకొండ శ్రీ సుధీర్ బాబు ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఎస్ హెచ్ ఓ పందిరి పరశురాం ఆధ్వర్యంలో ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్, బస్టాండ్, దేవాలయాలు, మజీద్, ఆర్టీసీ బస్ స్టేషన్, అత్యధిక జన సమూహం కలిగిన షాపింగ్ మాల్, సూపర్ మార్ట్ లలో, తదితర ప్రాంతాలలో డాగ్ స్క్వాడ్ మరియు బాంబు స్క్వాడ్ తనిఖీలు చేశారు. పరశురాం మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు భాగంగా తనిఖీలు నిర్వహించామని, ప్రజలకు భద్రత కల్పించేందుకు రాచకొండ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..

పార్థసారథి వివరించారు.ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏడాది పాలనపై సుదీర్ఘంగా చర్చించిన మంత్రివర్గం.. ఇప్పటివరకూ సాధించిన లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించింది. అలాగే వనమహోత్సవం, యోగా డే ఏర్పాట్లపైనా చర్చించారు. సీఆర్డీఏ నిర్ణయాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పలు సంస్థలకు భూకేటాయింపులు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. విశాఖలో 5 లక్షల మంది యోగాంధ్ర 2025 నిర్వహించి వరల్డ్ రికార్డుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 175 నియోజకవర్గాల్లో %మీవీజు% పార్కుల నిర్మాణానికి 475 కోట్ల రూపాయల ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఎన్టీఆర్ సుజల స్రవంతి ద్వారా రక్షిత తాగునీటి సరఫరా కోసం శ్రీకాకుళం జిల్లా ఉద్దానానికి రూ. 5.75 కోట్లు.. కుప్పంలో వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ కోసం రూ. 8.22 కోట్ల విడుదలకు ఆమోదం తెలిపింది ప్రభుత్వం. 17 మంది యావజ్జీవ ఖైదీలకు క్షమాభిక్ష పెట్టింది ఏపీ ప్రభుత్వం. 248 మందిని హెడ్ కానిస్టేబుల్స్గా పదోన్నతి కల్పించింది. వైఎస్ఆర్ జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మార్చింది. పోలీసు అకాడమీకి అదనంగా 94.45 ఎకరాలు ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదించింది. రాత్రి పూట విధులు నిర్వహించే మహిళా ఉద్యోగులకు పూర్తి రక్షణ కల్పించేందుకు చట్ట సవరణలు చేసింది. విశాఖపట్నంలోని యాత్రీ నివాస్ను అధునీకరించేందుకు పర్యాటక రంగం పంపిన ప్రతిపాదనల కోసం 13 కోట్ల 50 లక్షల రూపాయలను విడుదల చేసింది. బనకచర్లకు నిధుల సమీకరణపై ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది.

# 2 విడతల్లో చేనేత అభయహస్తం

రూ.9,000, అనుబంధ కార్మికుడికి రూ.3,000 సంబంధిత లబ్ధిదారుడి ఖాతాలో జమ చేస్తామని పేర్కొన్నారు. ఈ పథకంతో సుమారు 40 వేల మంది చేనేత, అనుబంధ కార్మికులు లబ్ధి పొందుతారని తుమ్మల వెల్లడించారు. ఇక రాష్ట్ర చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు ప్రత్యేకంగా 'యూనిక్ లోగో' జత చేస్తామని, తద్వారా ఆ వస్త్రాల నాణ్యతా ప్రమాణాలు, నేత కార్మికుడి వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు. 18 ఏళ్లు నిండడంతోపాటు జియో ట్యాగ్ చేసిన మరమగ్గాలపై పని చేసే కార్మికులతోపాటు ప్రీలూమ్, ప్రిపరేటరీ (డైయింగ్, టైయింగ్, డిజైనింగ్, వార్పింగ్, వైడింగ్, సైజింగ్) అనుబంధ పనులు చేసే వారితోపాటు చేనేత వృత్తితో వార్షికాదాయం 50 శాతం పొందుతున్న వారిని ఈ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు.

# జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశంలో వీధి దీపాల సమస్యలపై మాట్లాడిన కార్పొరేటర్ రాగం



**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి** జిహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో శేరిలింగంపల్లి డివిజన్ లో నెలకొన్న స్ట్రీట్ లైట్స్ పలు సమస్యలపై మేయర్ ద్వారా అధికారులను ప్రశ్నిస్తూ.. ప్రసంగించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్.

# ముగిసిన వికారాబాద్ జిల్లా బాడ్మింటన్ పోటీలు

**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** కొండాపూర్ లోని ఏ జోన్ బాడ్మింటన్ అకాడమీలో వికారాబాద్ జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన జిల్లా టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. బీఏ వీడి జిల్లా అధ్యక్షుడు కొసరాజు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి యు వి ఎన్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ టోర్నమెంట్ విజేతలకు పి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. టోర్నమెంట్లో వివిధ ప్రాంతాలకు చెందిన 265 మంది క్రీడాకారులు పాల్గొన్నారు సంతోషంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలను మరిన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



# రైతుల భూ సమస్యల పరిష్కారమే భూభారతి లక్ష్యం

## తహసిల్దార్ ఎం.హరికిషోర్ శర్మ




**నాగారం నమస్తే హైదరాబాద్: (జూన్ 4)** రైతుల భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూభారతి రెవిన్యూ చట్టాన్ని తీసుకువచ్చిందని తహసిల్దార్ ఎం. హరికిషోర్ శర్మ అన్నారు.రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూ సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంకృషి చేస్తుందని అన్నారు. బుధవారం ఆయన మండల



పరిధిలోని లక్ష్మాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి శాంతినగర్ హేమ్లా తండ మేఘ్య తండా భీమ్లా తండా లక్ష్మాపురం గ్రామాల రైతులతో భూభారతి రైతు సదస్సు నిర్వహించారు. అనంతరం రైతుల నుండి భూ సమస్యలకు సంబంధించిన 51 దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను వెంటనే భూభారతి పోర్టల్ లో ఆన్లైన్లో నమోదు చేస్తున్నామని భూభారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఒక్క రూపాయి ఫీజు లేకుండా భూ సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. కొత్త చట్టంలో భూమికి సంబంధించిన అన్ని సమస్యలకు పరిష్కార మార్గాలు చూపించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ షాహిన్ బేగం ఆర్ఐ అల్లావుద్దీన్ ఎంపిఎస్ఓ సిహెచ్ రమేష్ సీనియర్ అసిస్టెంట్ జూనియర్ అసిస్టెంట్ రెవెన్యూ సిబ్బంది పంచాయతీ కార్యదర్శి గోపి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



**నమస్తే హైదరాబాద్,శేరిలింగంపల్లి :** పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు.హఫీజ్పేట్ కి చెందిన లికియా బేగం కు ఎమ్మెల్యే గాంధీ వివేకానంద నగర్ లోని తన కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.32,000/- ముప్పై రెండు వేల రూపాయల విలువ గల చెక్కును కుటుంబ ఎమ్మెల్యే గాంధీ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పథకం వల్ల ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ రెడ్డి ,కరుణాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ తోటల సాగుతో అధిక ఆదాయం

**నాగారం, నమస్తే హైదరాబాద్: (జూన్ 4)** దీర్ఘ కాలం పంట అయిన ఆయిల్ పామ్ తోటలను సాగుచేసి ప్రతి నెల ఆదాయం పొందాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకాంత్ అన్నారు. బుధవారం నాగారం బంగ్లాలో నూతనంగా ఆయిల్ పామ్ సాగు చేస్తున్న కత్తుల వెంకన్న వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కను నాటే కార్యక్రమంను ప్రారంభించారు.

అనంతరం అయన మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న అయిల్ పామ్ తోటలను సాగు చేసినట్లు అయితే రైతులు ఆర్థిక%శీ%గా అభివృద్ధి చెందవచ్చు అని అన్నారు. ఆయిల్ పామ్ తోటనాటిన నాలుగవ సంవత్సరం నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది అని తెలిపారు.ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకి, అంతర పంటలకు రాయితీలు ఇస్తుందన్నారు. ఎరువులు మరియు అంతర పంటల యాజమాన్యానికి ఒక ఎకరానికి రూపాయలు 4200/- చొప్పున మొదటి నాలుగు సంవత్సరాలు ప్రోత్సాహకంగా డబ్బులు ఇవ్వబడుతుందని చెప్పారు.నమ్మకమైన నీటి వసతి గల రైతులు లాభదాయకమైన ఆయిల్ పామ్ పంటను సాగు చేసి, అధిక ఆదాయం పొందవచ్చునని తెలిపారు. ఒక ఎకరానికి దిగుబడి

**ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు అంతర పంటలకు ప్రభుత్వం రాయితీ**

**ఎకరానికి పది టన్నుల దిగుబడి**

**ఆసక్తిగల రైతులు ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి**



పది టన్నుల వరకు వస్తుందనీ మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటలుగా ప్రస్తుతం మార్కెట్లో బాగా డిమాండ్ ఉన్న కూరగాయలను, వాణిజ్య పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆయిల్ పామ్ తోటలు సాగు చేయాలనుకున్న ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫిసర్ పి అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు పలువురు రైతులు పాల్గొన్నారు.

# దరఖాస్తుల ఆహ్వానం




**నాగారం, నమస్తే హైదరాబాద్:(జూన్ 04)** మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఇంటర్ మీడియట్ కళాశాలగా అప్గ్రేడ్ అయినందున 2025%-%26 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్ విద్యాబోధన చేయుటకు గెస్ట్ లెక్చరర్ల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం బైపీసీ, ఎంఎల్టీ గ్రూప్లు మొదలవుతున్నందున ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ, తెలుగు, ఇంగ్లీష్, ఎంఎల్టీ సబ్జెక్టులు బోధించుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు తెలిపారు. అర్హులైన వారు తమ దరఖాస్తులను ఈనెల 5 నుంచి 9వ తేది వరకు వర్ధమానుకోటలోని కేజీబీవీలో అందించాలని తెలిపారు. పూర్తి వివరాల కొరకు కేజీబీవీ ప్రత్యేక అధికారి సంప్రదించాలని అన్నారు.


# కార్మికుడికి రావలసిన గ్రాడ్యుయేట్ డబ్బులు ఇప్పించిన బి ఆర్ టి యు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి



**నమస్తే హైదరాబాద్ (కూకట్పల్లి):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి ఇండస్ట్రీ ఏరియాలో "ఆర్ జె పి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్" కంపెనీలో వంశీ అనే కార్మికుడు గత ఐదు సంవత్సరాల నుంచి పనిచేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల ఆర్ జె పి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో మానేయడం జరిగింది. వంశీ అనే కార్మికుడికి గ్రాడ్యుయేట్ డబ్బులు 30,000/-వేల రూపాయలు రావాల్సి ఉ ండగా అవి ఇవ్వకపోవడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని ఎన్నిసార్లు అడిగినా వంశీ పట్ల నిర్లక్ష్యం వహిస్తూ తనను ఏదో రకంగా కంపెనీ యజమాన్యం పట్టించుకోవడం లేదు అని తెలుసుకొని అడిగి అడిగి విసుగు చెందిన కార్మికుడు వంశీ తనకు ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బి ఆర్ టి యు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి వంశి కి రావలసిన గ్రాడ్యుయేట్ డబ్బులు 30,000/- వేల రూపాయలు ఇప్పించడం జరిగింది. కార్మికుడు వంశీ, మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఈద్గా సిసి రోడ్డు పనులను ప్రారంభించిన 63 డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలి





**కాజిపేట్ జూన్ 4 నమస్తే హైదరాబాద్** 63వ డివిజన్లోని కాజిపేట్ ఈద్గా సిసి రోడ్డు పనులను ప్రారంభించిన స్థానిక 63 వ కార్పొరేటర్ విజయ్ శ్రీ సయ్యద్ రజాలి ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత రంజాన్ పండుగ రోజున ఈద్గాను సందర్శించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆరోజు మాట్లాడుతూ వచ్చే బక్రీద్ లోపు మీకు సీసీ రోడ్డు అందిస్తానని హామీ ఇచ్చారు నామినేషన్ వర్క్ కింద 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు మాట నిలుపుకున్న ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలియజేస్తున్న కార్పొరేటర్ యొక్క కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ సయ్యద్ రజాలితోపాటు తప్పు షేక్ బిలాల్ బిలాల్ ఖురేషి సయ్యద్ ఆసిఫ్ ఇస్మాయిల్ స్థానికులు పెద్దలు హెలెన్ టాయ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

NH paper 05-06-25 (4).pmd 3 6/5/2025, 6:17 AM

# సర్దార్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే





**నమస్తే హైదరాబాద్ (కూకట్ పల్లి):** ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బోరబండ డివిజన్ బీర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు సర్దార్ కుటుంబ సభ్యులను కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని. ఏదైనా ఇబ్బంది ఉన్న నన్ను సంప్రదించాలని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనితీరు ఉందని తాను కట్టుకున్న చిన్న ఇల్లును కూడా కూల్చేసి నానారకాలుగా వేధించడం వల్ల తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. సర్దార్ కుటుంబం ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉందని, రాక్షసుల్లా పీడించే కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పే రోజు త్వరలోనే ఉందని. దయచేసి ఎవరూ కూడా ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని ధైర్యంగా ఉండాలని ప్రజలకు సూచించారు. బిఆర్ఎస్ పార్టీ హయాంలో ఏనాడు కూడా ప్రజల్ని ఇలా ఇబ్బంది పెట్టిన దాఖలాలు లేవని.ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో భయపడవద్దని ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమములో మేడ్చల్ మైనారిటీ సెల్ అధ్యక్షులు యండి గౌసుద్దీన్, సత్యం, ఐలయ్య, వీరారెడ్డి, అబ్దుల్ రహీమ్, నూర్, అమీద్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న జనసేన నాయకులు : ప్రేమ కుమార్



**నమస్తే హైదరాబాద్ (కుకట్పల్లి):** కూకట్ పల్లి నియోజకవర్గంలోని మూసాపేట్ గూడ్స్ రోడ్ లోని ఈనాడు ఆఫీస్ దగ్గర గల శ్రీ పోచమ్మ ఎల్లమ్మ దేవాలయ కమిటీ సభ్యులు జిల్ల జీత్ రావు,జిల్ల బాబురావు, జిల్ల వెంకటేష్, జిల్ల సంజీవ్, జిల్ల గోపాల్, జిల్ల మధు ల ఆహ్వానం మేరకు శ్రీ పోచమ్మ , శ్రీ ఎల్లమ్మ , శ్రీ బంగారు మైసమ్మ, శ్రీ ముత్యాలమ్మ , శ్రీ ఉప్పలమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజలలో కూకట్పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లి జనసేన పార్టీ నాయకులు ఎన్ .నాగేంద్ర ,కొల్లా శంకర్ , పండుగ సూర్య , కలిగినిడి ప్రసాద్ , పోలె బోయిన శ్రీనివాస్ ,పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలోనే ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**దేవరుప్పుల (నమస్తే హైదరాబాద్ ):** దేవరుప్పుల మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్ లోని ప్రజా పాలనలో నేడు గ్రామాల్లో ఇందిరమ్మ ఇంట్లో నిర్మాణాలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు పంపిణీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సాధ్యమని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు, బుధవారం ఏర్పాటుచేసిన ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిగా హాజరయ్యారు. మండల వ్యాప్తంగా వివిధ గ్రామాలకు చెందిన ఇండ్లు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీవో, ఎమ్మార్వో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరాములు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు,పాల్గొన్నారు,



# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు ఎన్నికల హామీలేనా?

- రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలో తెలంగాణ ఉద్యమ అమరుల కుటుంబాలను విస్మరించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.
- కోటి రూపాయల పురస్కారం అందుకొన్నవారు కూడ నోరు మెదక పోవడం, వారి నైతికతపై మాయనిమచ్చ.
- టియుజేఏసి ప్రతిపాదించిన ప్రజాస్వామికమైన డిమాండ్లను గుర్తించకపోవడం ద్వందనీతికి నిదర్శనం.
- ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కన్వీనర్ షేక్ షావలి.



**నమస్తే హైదరాబాద్ :** ఘనంగా నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 12 వ అవతరణ దినోత్సవ వేడుకలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ అమరుల త్యాగాలను, వారి కుటుంబాలను విస్మరించడాన్ని ఐ.ఎఫ్.టి.యు. జాతీయ కన్వీనర్ షేక్ షావలి మంగళవారం రోజు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఖండించారు. తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలన్నికూడ, ఎన్నికల హామీలేనా? అని రాష్ట్ర ప్రభత్వాన్ని నిలదీశారు. గత బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులపట్ల అనుసరించిన విధానాన్నే నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడ తమ ద్వందనీతిని అనుసరిస్తున్నది ఆరోపించారు. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతున్న తెలంగాణ ఉద్యమకారులకు, వారి కుటుంబాలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వెనుక ఉన్న నిర్లక్ష్యాన్ని, అవకాశవాద రాజకీయాలను తీవ్రంగా ఎండగట్టారు. తెలంగాణ ఉద్యమకారులు మరోసారి మోసపోయారని గుర్తుచేశారు. గత పదిసంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో తమ అనునయులకు పెద్ద పీట వేసినట్లుగానే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడ తమ అనునయులకు మాత్రమే నగదు పురస్కారాలు, సంక్షమ ఫలాలను అందజేస్తున్నదని మండిపడ్డారు. గత కొన్ని నెలలుగా తొలి, మలి దశలో అన్నిరకాలుగా నష్టాలను చవిచూసిన ఉద్యమ కారుల త్యాగాలకు న్యాయమైన, ప్రజాస్వామికమైన గుర్తింపును కోరుకుంటున్నారని అన్నారు. అందులో బాగంగానే మంత్రులకు, అధికారులకు ఎన్నో విజ్ఞప్తి పత్రాలు, నిరసన దీక్షలు లాంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళారని అన్నారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల వారితో చర్చలు, సమిక్షలు జరిపి, ఉద్యమ కారుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందు తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ పెట్టిన ప్రతిపాదనలు గుర్తింకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ వైఫల్యాలను ఎత్తిచూపి, అప్పటి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి తోపాటు, పార్టీ పెద్దలకు తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఉద్యమ కారుల పక్షాన నిలబడేటట్లు చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కారణమైన టియుజేఏసి, తెలంగాణ ప్రజలు, ఉద్యమ కారుల ప్రయోజనాల కొరకు జూన్-2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున ఉద్యమ కారుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారని గుర్తుచేశారు. వారి ఆశలను అడిఆశలు చేశారని అన్నారు. ఇది తెలంగాణ ఉద్యమకారులేనే గాక, అమరులను, వారి త్యాగాలను అవమానించడమేనని స్పష్టం చేశారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికి కాదు, కొందరకే అన్నట్లుగా పాలకులు వ్యవహారించడం దోపిడీ, అసమానతలను పెంచి పోషించడమే నని గుర్తుచేశారు. ఇలాంటి క్రమంలో కవులు, కళాకారుల పేరున ప్రకటించిన కోటి రూపాయల నగదు పురస్కారాలు అందుకున్న వారైన, కనీసం తెలంగాణ ఉద్యమకారుల పక్షాన సంక్షేమ బోర్డుకు డిమాండ్ చేయకపోవడం వారి నైతికతకు మాయనిమచ్చ అని గుర్తుచేశారు. 2047 నాటికి తెలంగాణ రాష్ట్రం ప్రపంచంలో నెంబర్ వన్ గా నిలస్తుందో? నిలవదో కానీ ముందుగా ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల గత ప్రభుత్వాన్ని గద్దె దింపినట్లుగానే, రాబోయే రోజుల్లో అలాంటి చేదు అనుభవాలను తెలంగాణ ఉద్యమకారులు, వారి కుటుంబాల నుండి చవిచూడవలసి ఉంటుందని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని షేక్ షావలి హెచ్చరించారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు అనుకూలంగా ప్రకటన రాబోతుందని, టియుజేఏసి నిర్వహిస్తున్న కార్యక్రమాలపై శోషల్ మీడియాలో బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ ఉద్యమ ఫోరం ఇప్పటికైన తమకున్న భ్రమలను వదులుకొని, టియుజేఏసితో కలిసి సంఘటితంగా తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీల అమలుకు ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆర్సీబీ విక్టరీ సెలబ్రేషన్స్‌లో తొక్కిసలాట 11 మంది మృతి!

ఆర్సీబీ విజయోత్సవంలో మాత్రం తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆర్సీబీ విక్టరీ సెలబ్రేషన్స్‌లో పాల్గొనేందుకు భారీ ఎత్తున వచ్చిన అభిమానులు ఒక్కసారిగా ఎగబడ్డంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఐపీఎల్ 2025లో భాగంగా మంగళవారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆర్సీబీ విజయం సాధించి.. ఛాంపియన్‌గా నిలిచింది. 18 ఏళ్ల ఐపీఎల్ చరిత్రలో వారికి ఇదే తొలి కప్పు. దీంతో ఆర్సీబీ టీమ్‌తో పాటు వారి అభిమానులు కూడా తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.ఐపీఎల్‌లో అన్ని టీమ్స్ కంటే అత్యధిక ఫ్యాన్ బేస్ ఉన్న ఆర్సీబీ కప్పు గెలవడంతో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించాలని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించింది. ముందుగా విధాన సౌధాకు వెళ్లి అక్కడ సీఎం సిద్ధరామయ్యను కలిసి, అక్కడి నుంచి విక్టరీ పరేడ్ నిర్వహిస్తూ.. ర్యాలీగా చిన్నస్వామి స్టేడియానికి చేరుకోవాలని ప్లాన్ చేశారు. కానీ, పోలీసులు ర్యాలీకి అనుమతి ఇవ్వలేదు. కానీ, స్టేడియంలో సెలబ్రేషన్స్‌కు పర్మిషన్ ఇచ్చారు. అయితే అభిమానులు భారీ ఎత్తున తరలిరావడం, స్టేడియంలోకి గోడలు, బారిగేట్లు దొకి వెళ్లే ప్రయత్నం చేయడంతో తొక్కిసలాట చోటు చేసుకుందని సమాచారం.ఈ ఘటనలో ఇప్పటికే 11 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. అయితే ఈ ఘటనపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ క్షమాపణలు చెప్పారు. తాము అభిమానులను అదుపుచేయలేకపోయామని, మృతుల కుటుంబాలకు క్షమాపణలు చెబుతున్నట్లు వెల్లడించారు. అలాగే సీఎం సిద్ధరామయ్య ఈ



తొక్కిసలాటలో గాయపడిన వారు చికిత్స పొందుతున్న బౌరింగ్ ఆస్పత్రికి వెళ్లి వారిని పరామర్శించారు.

# సీఎం సభ స్థలిని పరిశీలించిన రాచకొండ సిపి



నమస్తే హైదరాబాద్ : తుర్కపల్లి మండలం తిరుమలపూర్ గ్రామంలో జూన్ ఆరవ తేదీన నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ స్థలిని బుధవారం రాచకొండ సి పి సుధీర్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా షెడ్ల నిర్మాణము, హెలిప్యాడ్ నిర్మాణము ,పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి బహిరంగ సభకు కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బందోబస్తుకు 1500 మంది పోలీసులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు .సభను ప్రశాంతంగా నిర్వహించుకుంటకు పోలీస్ తరఫున అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రజలు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి అక్షన్ష్ యాదవ్, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, పోలీసు అధికారులు రాహుల్ రెడ్డి ,చేబ్రోయి లక్ష్మీనారాయణ, మల్లారెడ్డి ,ప్రభాకర్ రెడ్డి, వినోద్ కుమార్ ,ఏసీబీ శ్రీనివాస్ నాయుడు, సిఐ శంకర్ గౌడ్, ట్రాఫిక్ సిఐ ఎలగొండ కృష్ణ, ఎస్సై తక్యుద్దీన్, ట్రాఫిక్ ఎస్ఐ దేవేందర్, పోలీసులు పాల్గొన్నారుసభస్థలిని పరిశీలించిన అధికారులు. ముఖ్యమంత్రి బహిరంగ సభ స్థలిని జిల్లా అధికారులు పరిశీలించారు. పరిశీలించిన వారిలో జెడ్పి సీఈవో శోభారాణి, డిపిఓ సునంద, ఇరిగేషన్ శాఖ అధికారులు, తాసిల్దార్ దేశ్య నాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఉన్నారు.

# దళితుల సంక్షేమం కాంగ్రెస్ లక్ష్యం-మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నమస్తే హైదరాబాద్ : దేశంలో ఎక్కడా లేనివిధంగా రాహుల్ గాంధీ సూచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుల గణన చేపట్టి దేశానికి తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో దళితవాడలో పోచమ్మ దేవాలయ అభివృద్ధి కొరకు 45 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో దళితుల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం జరిగిందని అంతేకాకుండా ప్రతి గ్రామంలోని దళితవాడల అభివృద్ధి కోసం కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయంలో దళితులది ముఖ్య పాత్ర అని ఆయన అన్నారు. గజ్వేల్ నియోజకవర్గం నుండి రెండుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్ దళిత వాడాలను పట్టించుకోలేదని మాజీ సీఎం కెసిఆర్ పై ఘాటుగా విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ పట్టణ అధ్యక్షులు మొనగారూ రాజు ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్ మాజీ సర్పంచ్ సుఖేందర్ రెడ్డి, కుంట్ల లక్ష్మారెడ్డి , గాడి పల్లి శ్రీనివాస్ జహీర్ ,అరుణ్ కుమార్, పూల యాదగిరి పార్టీ నేతలు పాల్గొన్నారు.

# కొరటికల్ గ్రామంలో నియో విజన్ కంటి ఆసుపత్రి వారి ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని నిర్వహించిన గ్రామీణ శుశ్రుత వైద్యులు



నమస్తే హైదరాబాద్ : ఆత్మకూరు మండల పరిధిలోని కోరటికల్ గ్రామంలో శ్రీ భవాని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు , సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం మండల నాయకులు శ్రీరాముల అత్రి ఆధ్వర్యంలో హబ్సిగూడ లోని నియో విజన్ కంటి ఆసుపత్రి వారి వైద్య బృందం సహకారంతో గ్రామ ప్రజలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు . ఈ సందర్భంగా శ్రీ భవాని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకులు శ్రీరాముల అత్రి మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అని పెద్దలు చెప్పిన మాట ప్రకారం ప్రతి ఒక్కరూ తమ నేత్రాలను జాగ్రత్తగా చూసుకోవాలని కంటి చూపు తేడా అనిపిస్తే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని కోరారు . కన్న తల్లి లాంటి స్వంత ఊరి ప్రజలకు నా వంతు సేవలు అందించే ఉద్దేశ్యంతో నియో విజన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశానని తెలిపారు . గ్రామ ప్రజలు , మహిళలు , వృద్ధులు ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ కంటి వైద్యుల పర్యవేక్షణలో పరీక్షలు చేయించుకున్నారని అన్నారు . ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణు , సూర్య , నియో విజన్ కంటి ఆసుపత్రి సిబ్బంది , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు .

# బొబ్బల జ్యోతి కి పీహెచ్డీ డాక్టరేట్ ప్రధానం...




నమస్తే హైదరాబాద్ : మోటకొండూరు వాసి బొబ్బల జ్యోతి కి గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్డీ డిగ్రీ ప్రదానం.... జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జే ఎన్ టి యు) హైదరాబాద్‌లో నిర్వహించిన 13వ స్నాతకోత్సవ కార్యక్రమంలో మోటకొండూరు మండలానికి చెందిన బొబ్బల జ్యోతి %ణ/శీ% బొబ్బల లక్ష్మారెడ్డి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక డాక్టరేట్ (పీహెచ్డీ) డిగ్రీ ప్రదానం చేయడం జరిగింది.భౌతిక శాస్త్రంలో ఆమె చేసిన పరిశోధనలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి జర్నల్స్‌లో విశేష గుర్తింపు పొందాయి. “క్యారెక్టరైజేషన్ ఆఫ్ మెటీరియల్స్ యూజింగ్ ముల్లర్ మెట్రిక్స్ ఫార్మాలిజం అండ్ స్టోక్స్ వెక్టార్స్” అనే అంశంపై ఆమె చేసిన పరిశోధనల దృష్ట్యా ఈ గౌరవప్రదమైన పీహెచ్డీ డిగ్రీని ఆమెకు జేఎన్టీయూ అందజేసింది. ఆమె సాధన యువ శాస్త్రవేత్తలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ఘనతకు గాను ఆమెకు కుటుంబ సభ్యులు, గురువులు, సహచరులు గ్రామస్తులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# ప్రభుత్వం రెవెన్యూ శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం...

## రైతులు రెవిన్యూ ఆఫీసుల చుట్టూ తిరగకుండా అధికారులే వచ్చి పరిష్కరిస్తారు.. ఎంఎల్ఏ



నమస్తే హైదరాబాద్ : యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలం ధర్మారం గ్రామం లో గ్రామపంచాయతి కార్యాలయం లో ఎమ్మెల్యే మందుల సామెల్ మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం, రైతులు రెవిన్యూ ఆఫీసుల చుట్టూ తిరగకుండా అధికారులే వచ్చి పరిష్కరిస్తారు, సాధాబాయినామా భూములను పరిశీలించి లబ్ధిదారులకు అందిచడం మే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు, అవగాహన కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మనికోటి జ్యోతి, సిపిఐ నాయకుడు చెడే చంద్రయ్య, పిఎసిఎస్ చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో న్యాయవాద వృత్తికి ప్రత్యేక స్థానం ఉంది... మాజీమంత్రి,

నమస్తే హైదరాబాద్ : సమాజంలో న్యాయవాద వృత్తికి ప్రత్యేక స్థానం ఉంది... ఆ దిశగా న్యాయం కోసం పరితపిస్తూ ముందుకెళ్లటం అభినందనీయమని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాడు శంకర్ పల్లి లో సీనియర్ న్యాయవాది ఉపేందర్ రెడ్డి,జీతేందర్ రెడ్డి లు ఏర్పాటు చేసిన నూతన ‘యూ జె’లా ఛాంబర్ ని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయ సేవలు అందేలా చొరవ చూపాలన్నరు.సమాజంలో న్యాయవాద వృత్తికి ఎంతో గౌరవం ఉందని అటు కక్షిదారునికి,ఇటు న్యాయ మూర్తులకు మధ్య ఉంటూ న్యాయం కోసం పనిచేయటం గొప్ప విషయం అన్నారు.ఈ ప్రాంతంలో సీనియర్ లాయర్ గా ఉపేందర్ రెడ్డి అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని,మరింతగా రాణించి పెరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ఉపేందర్ రెడ్డి సోదరులను అభినందించారు.యువ న్యాయవాదిగా ఉపేందర్ రెడ్డి,జీతేందర్ రెడ్డి లకు మంచి భవిష్యత్తు ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ క్రిష్ణారెడ్డి,సొసైటీ చైర్మన్ శశిధర్ రెడ్డి,మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి,సొసైటీ డైరెక్టర్లు మహేందర్ రెడ్డి,శారద, మాజీ జడ్పీటీసీ కె నారాయణ,మాజీ ఎంపీపీ నర్సింలు,మాజీ మార్కెట్ చైర్మన్లు ప్రకాష్ గుప్తా, మానిక్ రెడ్డి,పాపారావు,,జిల్లా జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు ఎం డి సలీమ్ పాషా,మాజీ సర్పంచ్ లు వెంకట్ రెడ్డి,శ్రీధర్,సురేష్,నరసింహా రెడ్డి,మానిక్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,నరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్,పాండురంగ రెడ్డి,బాల కృష్ణ,ముకుంద రెడ్డి,కృష్ణ రెడ్డి,చేవెళ్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.



# “ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు: బర్రె జహంగీర్”


**30 మంది ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డి గారికి కృతజ్ఞతలు..**




నమస్తే హైదరాబాద్ : నిరుపేదలో నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అన్నారు. నిన్న భువనగిరి నియోజకవర్గ ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమాన్ని భువనగిరి పురపాలక సంఘం లోని వివిధ వార్డులకు 1200 ఇందిరమ్మ ఇండ్లను స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారు జిల్లా కలెక్టర్ అధికారులు ప్రారంభించడం జరిగింది ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈరోజు పట్టణంలోని 8వ వార్డుకు 30 మంది కి చెందిన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డి సహకారం మేరకు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ధృవీకరణ పత్రాలను అందజేస్తూ రేకులు, పైకప్పులు లేని నిరుపేదలకు ఖాళీ స్థలం ఉండి ఇల్లు కట్టుకోలేని పేదల్లో పేదలకు ఈ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం 5 లక్షల రూపాయలతో మంజూరు పత్రాలు మీకు ఇవ్వడం జరుగుతుంది . మీరు కూడా ప్రభుత్వ లక్ష్యాన్ని మీరు కూడా ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు కార్చకుండా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే గత పదేండ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డి సహాకారంతో నిజమైన నిరుపేద కుటుంబాలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో నేడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఇళ్లే ఉన్నాయని ఇప్పుడు మల్లి ఆ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదల కళా సాకారమైందని ఇంకా కూడా అవసరమై ఇల్లు కట్టుకునే ఆలోచన ఉన్న పార్టీలకతీతంగా ఎమ్మెల్యే గారు ప్రత్యేకంగా చొరవతో 8వ వార్డు దళిత, ముస్లిం, బలహీన వర్గాల వార్డు అయిన ప్రజలకు అన్ని రకాలుగా సహాయం చేయడం కోసం ఆమె ఇవ్వడం జరిగిందని ప్రత్యేకంగా వారికి వార్డు ప్రజల పక్షాన ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మున్సిపల్ ఇంచార్జ్ వినోద్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉడత రమేష్, గోపె శివ,దొంతి నిర్మల, బత్తుల బాబు, కడారి నరేష్ యాదవ్,దొంతి రాంచందర్,ఇట్టబోయిన శ్రవణ్, 30 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సమతా ప్రకాష్

**నియోజకవర్గం కాంగ్రె ఈస్ పార్టీ మహిళా%వఅఎ% అధ్యక్షురాలు కంద**



నమస్తే హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లామహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం పాలెం అమీర్‌పెట్ గ్రామం ఆవుల చిన్న అంజయ్య గార్డెన్స్ లో యాదయ్య వెడ్స్ అనన్య వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు కందుల సమత ప్రకాష్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కోళ్లపడకల్ చేపాంగి 6%ఎ666౯%5టిటి65ప్రవీణ్ ఇంద్రమ్మ కమిటీ చైర్మన్ మహేశ్వరం నియోజకవర్గం సేవాదళ్ అధ్యక్షులు గదగుటి హరి కృష్ణ ముదిరాజ్ మహేశ్వరం మండల్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ గొల్లూర్ రాజు ,మహేశ్వరం మండల్ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ పెంజర్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కు దే%ఖీ౯౯8××%8మార్ ,చేపాంగి మలేష్ ,మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# ప్రైవేట్ విత్తన కంపెనీలు రైతాంగాన్ని కల్తీ విత్తనాలతో మోసం చేస్తున్నా పట్టించుకోరా?

నమస్తే హైదరాబాద్ : తొలకరి వ్యవసాయం ప్రారంభమై ఇరవై రోజులు గడుస్తున్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం,వ్యవసాయ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, బ్యాంక్ రుణాలను,రైతు భరోసాను ఇవ్వకుండా రైతులను గాలికి వదిలేస్తున్నారని,ఇలాంటి పరిస్థితులలో రైతులు వ్యవసాయాన్ని సాగుచేయడం ఎలా సాధ్యం అని అఖిల భారత రైతు.కూలీ సంఘం (ఏ ఐ కే ఎం ఎస్)తెలంగాణ రాష్ట్ర అద్యక్షులు మామిడాల బిక్ష పతి ప్రశ్నించారు.

ఏ ఐ కే ఎం ఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు రైతులకు సకాలంలో విత్తనాలు,ఎరువులు, పురుగు మందులను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 3 నుంచి 5 వరకు మండల,జిల్లా కేంద్రాలలో ప్రదర్శనలు,ధర్నాలు నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా బుధవారం నాడు ఆలేరు తహాశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా బిక్ష పతి మాట్లాడుతూ,తొలకరి






వ్యవసాయ మాసం ప్రారంభం అయి ఇరవై రోజులు గడుస్తున్నప్పటికీ రైతాంగానికి కావల్సిన విత్తనాలు,ఎరువులు, పురుగు మందులను సరఫరా చేయకపోవడం కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ ఏపాటిదో అర్థం అవుతుందని అన్నారు.

ప్రతి యేటా రైతులకు ప్రైవేట్ కంపెనీల విత్తన వ్యాపారులు కల్తీ విత్తనాలను సరఫరా చేసి లక్షల రూపాయలను సంపాదిస్తూ రైతులను ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ విత్తన వ్యాపారుల వద్ద కల్తీ విత్తనాలు పుష్కలంగా ఉంటే,ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం,కల్తీ నివారణ చర్యలు తీసుకోకుండా రైతులకు సకాలంలో సక్రమమైన విత్తనాలను అందించక పోవడం వ్యవసాయాన్ని,రైతాంగాన్ని దివాలా తీయించడమేనని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా నాయకులు ఇక్కిరి సహదేవ్,గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య,జిల్లా ఉపాధ్యక్షులు చిర బోయిన రాజయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్,జిల్లా సహాయ కార్యదర్శి పిన్నపు రెడ్డి రాఘవ రెడ్డి, జిల్లా కోశాధికారి బర్మ బాబు,పీ ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షులు ఆర్.సీత, ఏ ఐ కే ఎం ఎస్ జిల్లా నాయకులు ఇక్కిరి సహదేవ్,ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు, జిల్లా నాయకులు చిర బోయిన కొమురయ్య,మామిడాల బాల మల్లేష్,కర్రె స్వామి,తమ్మడి అంజయ్య, వంగాల నర్సింహారెడ్డి,గడ్డం మంకయ్య, వంగాల మధుసూదన్ రెడ్డి,టంగుటూరు మాజీ సర్పంచ్ కట్టా సమరసింహారెడ్డి,యెలగందుల సిద్దులు,ఆర్.ఉదయ్, కల్లెపు చంద్రయ్య,కడకంచి సత్యనారాయణ, సుంచు రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధిగా ప్రతి పల్లెను తట్టిన ప్రజా నాయకుడు డాక్టర్ మెతుకు ఆనంద్

## బంట్వారం మండల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లాపూరం శ్రీనివాస్.



నమస్తే హైదరాబాద్ : బుధవారం నాడు బంట్వారం మండల కేంద్రంలో, వికారాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్ జన్మదినాన్ని పురస్కరించుకొని పార్టీ నాయకులు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించుకున్నారు, మండల కేంద్రంలో కేక్ కటింగ్ చేసి అనంతరం వికారాబాద్ నుండి అనంతగిరి దేవాలయం శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం వరకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, జిల్లా పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, ఈ సందర్భంగా బంట్వారం మండల బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లాపురం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికై వికారాబాద్ చరిత్రలో ఎమ్మెల్యేగా ప్రతి గ్రామాన్ని ప్రతి వీధిని సందర్శించిన ఖ్యాతి డాక్టర్ మెతుకు ఆనంద్ కు దక్కుతుందని, మీతో నేను కార్యక్రమంతో ప్రతి పల్లెను తట్టి సమస్యల పరిష్కారానికి వారు చేసిన కృషి ప్రతి మనిషికి గుర్తుండి పోతుందన్నారు, ప్రజాక్షేత్రంలో ప్రజల కోసం ఎన్నికై ప్రజల కోసం పనిచేసిన ప్రజానాయకుడు డాక్టర్ మెతుకు ఆనంద్ రాబోయే రోజుల్లో మళ్లీ ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటూ మండల ప్రజల తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు బల్వంత్ రెడ్డి, మండల రైతు బంధు మాజీ అధ్యక్షులు ఖాజా పాషా, ప్రధాన కార్యదర్శులు మబ్బు రాజు, బి.శ్రీనివాస్, సీనియర్ నాయకులు బల్వంత్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు నర్సిములు, మాజీ ఎంపీటీసీ ప్రవీణ్, సుధాకర్ గౌడ్, ఎర్ర ఆనంతి, ఖలీమ్ పాషా, ఏలియా, లాజర్, నర్సిములు, మౌలానా, అశోక్, సుదర్శన్, ఖదీర్, శ్రీకాంత్, నరేష్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి పక్కన నిద్రిస్తున్న పసివాడిని భిక్షాటన కోసం కిడ్నాప్

నమస్తే హైదరాబాద్ : కామారెడ్డి, జూన్ 4: అభంశుభం తెలియని పసివాళ్లను కన్నోళ్ల కళ్లుగప్పి ఎత్తుకెళ్లి భిక్షాటన కోసం వినియోగించే ముఠాలు దేశ వ్యాప్తంగా పలు నగరాల్లో దందాసాగిస్తున్నారు. తాజాగా రెండేళ్ల పిల్లాడిని భిక్షాటన కోసం కిడ్నాప్ చేసిన ఘటన కామారెడ్డి పట్టణంలో వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన పోలీసులు నిఘా నేత్రాల సాయంతో కేవలం 3 గంటల్లోనే కేసును ఛేదించారు. కామారెడ్డి పోలీస్ స్టేషన్ లో ఏఎస్పీ చైతన్య రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండలానికి చెందిన మొక్కల నర్సింహులు, అతని భార్య, వారి రెండేళ్ల కుమారుడితో సిరిసిల్ల రోడ్డులోని ఒక దుకాణం వద్ద నిద్రించారు. అర్ధరాత్రి సమయంలో లేచి చూసేసరికి వారి పక్కన పడుకున్న రెండేళ్ల కుమారుడు హర్షిత్ కనిపించలేదు. దీంతో కంగారుపడిపోయిన దంపతులు చుట్టుపక్కల వెతికారు. కానీ ఎక్కడా పిల్లాడి జాడ కనిపించలేదు. దీంతో తాము నిద్రలో ఉన్న సమయంలో ఎవరో ఎత్తుకెళ్లి ఉంటారని భావించి.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బృందాలుగా ఏర్పడి నగరమంతా జల్లెడ పట్టారు. ఇందులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించగా.. ఓ జంట నిద్రపోతున్న పిల్లాడిని ఎత్తుకెళ్లడం గమనించారు. ఫుటేజీ ఆధారంగా ఆ జంట కోసం వెతికిన పోలీసులు వారిని కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో గుర్తించారు. పిల్లాడిని ఎత్తుకుని భిక్షాటన చేస్తూ ఆ జంట కనిపించింది. విచారణలో నిందితులు దోమకొండకు చెందిన పల్లపు రాజు, శారదగా గుర్తించారు. భిక్షాటన కోసం తల్లివద్ద నిద్రిస్తున్న పిల్లాడిని కిడ్నాప్ చేసినట్లుగా నేరం అంగీకరించారు. పోలీసులు వారి వద్ద నుంచి బాబును స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును కేవలం మూడు గంటల్లోనే ఛేదించి.. బిడ్డను తల్లివద్దకు చేర్చిన సీఐ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీరామ్, బీసీలు విశ్వనాథ్ విజయరాజు నరేష్ రవి, అశ్వినిలను ఏఎస్పీ చైతన్య రెడ్డితోపాటు స్థానికులంతా పొగడ్తలతో ముంచెత్తారు.

# స్వరనీరాజనానికి పోటెత్తిన జనం..

స్వరనీరాజనానికి పోటెత్తిన జనం..
డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కళా పరిషత్ పేరుతో మాచర్లలో కనీవినీ ఎరుగని రీతిలో సినిమా పాటల పోటీలు..
ఆదివారం ఉదయం నుండి సోమవారం తెల్లవారుజాము వరకు నిర్విరామంగా కొనసాగిన కార్యక్రమం...






**నమస్తే హైదరాబాద్ :** గానగంధర్వుడుడాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం 79 వ జయంతిని పురస్కరించుకొని మాచర్ల పట్టణంలో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ పేరుతో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఆదివారం నిర్వహించిన "స్వరనీరాజనం" తెలుగు సినిమా పాటల పోటీలకు జనం పోటెత్తారు. ఆదివారం ఉదయం నుండి జరిగిన ఎంపికకు జిల్లా స్థాయిలో ఇప్పటి వరకూ ఎన్నడూ లేని విధంగా వివిధ ప్రాంతాల నుండి 150 మంది గాయనీ గాయకులు పాల్గొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియ ఆదివారం సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. ఎంపికైన వారితో అనంతరం రెండు గంటల విరామం తర్వాత పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు సోమవారం తెల్లవారుజాము మూడు గంటల వరకు కొనసాగాయి. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ముటుకుల కమలాసన్ ప్రారంభించి కొనసాగించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి మాట్లాడుతూ మాచర్ల పట్టణంలో మొట్టమొదటిగా డాక్టర్ ఎస్పీ బాలసుబ్రమణ్యం కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన "స్వరనీరాజనం" పాటల పోటీలకు విచ్చేసిన గాయనీ గాయకులందరికీ ఆయన కళా పరిషత్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా పాటల పోటీల కార్యక్రమ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి 10000వేల రూపాయలను విజయవాడకు చెందిన ఎమ్మెస్ శివ బాబు, ద్వితీయ బహుమతి 7000 రూపాయలను వి ఆనందరావు, తృతీయ బహుమతి 5000 రూపాయలను కెయం నాయుడు, నాలుగవ బహుమతి 4000 రూపాయలను బి. కోటేశ్వరరావు, ఐదవ బహుమతి 3000 రూపాయలను వేజెండ్లకు చెందిన వెంకటేశ్వర్లు గెలుపొందారు. వారితో పాటుగా మరో 35 మంది గాయనీ గాయకులకు వెయ్యి రూపాయల కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. అంతేకాకుండా లక్కీ డ్రా ద్వారా పది మంది మహిళలకు వెయ్యి రూపాయల ఖరీదు చేసే చీరలను అందజేశారు. కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది పదవ తరగతి,ఇంటర్ పరీక్షా ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన పదిమంది విద్యార్థులకు కళా పరిషత్ తరపున జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన మాచర్ల మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్ సాహెబ్ మాట్లాడుతూ మాచర్లలో మునుపెన్నడూ లేని విధంగా ఎస్పీ బాలసుబ్రమణ్యం కళా పరిషత్ పేరుతో నిర్వహించిన "స్వరనీరాజనం" పాటల పోటీలకు విశేష స్పందన లభించిందని అన్నారు.

ఎప్పుడూ కక్షలు కార్పణ్యాలతో ఉండే పల్నాడు ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను ఆనందింప చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన అధ్యక్షులు కొత్త మాసు శ్రీరామమూర్తిని, ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్ ఖాన్, జాయింట్ సెక్రెటరీ పులుసు శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షులు బాహాటం శేషగిరి రాజు,ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు, కార్యవర్గ సభ్యులు కాశిబోయిన శివశంకర్,గట్ల కోటిరెడ్డిలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిగొడుపు నరసరాజు వ్యాఖ్యాతగా వ్యవహరించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీనియర్ జర్నలిస్ట్ ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విద్యాధరణి మురళి ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. కార్యక్రమం ఆద్యంతం ఆయన పాటల పోటీలను తిలకించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో చుండూరు వెంకటేశ్వర్లు, కుర్రి శాయిమార్కొండా రెడ్డిలు కూడ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర కోశాధికారి విద్యాధరణి నరసరాజు, కృష్ణవేణి జూనియర్ కాలేజ్, ఎస్ వి ఆర్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ యనమదల వెంకటరామయ్య, ఆక్స్ఫర్డ్ స్కూల్స్ మాజీ ప్రిన్సిపల్ సైకాలజిస్ట్ ఎంబిఎస్ కోటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పోలూరి నరసింహారావు, మాచర్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు తోపాటు పట్టణంలోని లైన్స్ క్లబ్ రోటరీ క్లబ్ న్యాయవాదులు, డాక్టర్లు, పుర ప్రముఖులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పోటీలకు హైదరాబాదుకు చెందిన రాజగోపాల్, కళ్యాణి, విశ్వేశ్వరరావు, గొట్టిపాటి రామారావు లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

# యోగా శిక్షణ తరగతులు

**నమస్తే హైదరాబాద్ :** పో కూరి మాల్యాద్రి,యోగాంధ్ర కార్యక్రమములో భాగముగా ఇన్చార్జి ఎంపీడీవో కార్లో ఒంగోలు కె. నరేంద్రదేవ్ చుండి సచివాలయంలో యోగా శిక్షణా తరగతులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వయసుల వారు యోగా లో పాల్గొనాలని ,అంతేకాకుండా ధ్యాన పద్ధతులను నేర్చుకొని మానసిక ,శారీరక ఆరోగ్యాన్ని ప్రశాంతతను అలవరచుకోవాలని తెలిపారు. పారిశుధ్యం ఆరోగ్య పరిరక్షణ పై సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో వివిధ వయసుల చెందిన 30 మంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# పందిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిల్ ప్రేమికునికి ఘన సన్మానం



**నమస్తే హైదరాబాద్ :** ది. 03-06-2025 మంగళ వారం నాడు ప్రపంచ సైకిల్ దినోత్సవ సందర్భంగా కోదాడ వాసి, సైకిల్ ప్రేమికుడు, ఇప్పటి వరకు 3,50,000 కిలోమీటర్లు సైకిల్ పై ప్రయాణించిన 71 సంవత్సరాల వ్యక్తి బాబు ని కోదాడ యం.యస్ విద్యా సంస్థల లో పందిరి ఫౌండేషన్ చైర్మన్ పందిరి నాగిరెడ్డి, ఫౌండేషన్ గౌరవ సలహాదారు యస్ యస్ రావు లు శాలువాతో సన్మానించి కొంత ఆర్థిక చేయూత అందించారు.

ఈ కార్యక్రమంలో ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని, తేజ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.యాదగిరి రెడ్డి, కళాశాల సిబ్బంది జి. నాగేశ్వరరావు, బి .నాగేశ్వరరావు, జానీ మియా, తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు అడ్డంకులు కలిగించవద్దు

## అఖిలపక్ష నాయకుల ఏకాభిప్రాయం

**నమస్తే హైదరాబాద్ :** నేరేడుచర్ల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయనున్న భారతరత్న డాక్టర్ బి .ఆర్ అంబేద్కర్ మరియు సంఘసంస్కర్తలైన జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటుకు సంబంధిత అధికారులు ఎవరూ అడ్డంకులు కల్పించొద్దని పట్టణంలోని అఖిలపక్ష నాయకులు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని ప్రధాన కూడలి వీరబ్రహ్మేంద్రస్వామి గుడి ప్రక్కన తాత్కాలికంగా అంబేద్కర్, జ్యోతిరావు పూలే దంపతుల ఫ్లెక్సీలను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో భాగంగా రావి చెట్టు కింద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం జరిగిందని అప్పటి పాలకులు అంబేద్కర్ విగ్రహాన్ని ప్రధాన కూడలిలో పునర్ నిర్మిస్తామని మాట ఇచ్చి తప్పినందున ఈ రోజున అఖిలపక్షం ఆధ్వర్యంలో అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహ నిర్మాణం కొరకు శంకుస్థాపన చేశామని కానీ విద్యుత్ శాఖ వారు అడ్డు వస్తున్నందున సంబంధిత మున్సిపాలిటీ వారు తాసిల్దార్ జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉన్నదని వారు కోరారు. శంకుస్థాపన కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్ బిజెపి పట్టణ అధ్యక్షుడు కొణతం నాగిరెడ్డి సిపిఎం పట్టణ కార్యదర్శి కోదమగుండ్ల నాగేష్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి వాసపల్లయ్య



తెలుగుదేశం మండల అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను ఎమ్మార్పీఎస్సీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడవల్లి చంద్రయ్య డాల్ఫిన్ శ్రీనివాస్, తక్కెళ్ళ నాగార్జున, శంకర్ రెడ్డి, నీల రామ్మూర్తి, టి యు సి ఐ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ జిల్లా నాయకులు వాస కరుణాకర్, కాలం నాగయ్య, కొమ్మరాజు వెంకట్ పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఆర్పిసి విజిలెన్స్ సెల్ నంద్యాల జిల్లా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన.కే.అస్తాన్ వలి

**నమస్తే హైదరాబాద్ :** భారత రాజ్యాంగంలోని చట్టాలను భారత దేశ పౌరులకు అవగాహన కల్పించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ నేషనల్ చైర్మన్ ఆర్ కె. కంబగిరి స్వామి గారు అన్నారు అనంతరం ఆయన మంగళవారం కొలిమిగుండ్ల లో మాట్లాడుతూ ఎన్ హెచ్ఆర్పిసి విజిలెన్స్ సెల్ జిల్లా చైర్మన్ గా కే అస్తాన్ వలి గారికి నియామక పత్రాన్ని ఐడెంటి కార్డు అవార్డు సర్టిఫికెట్ ను అందజేశారని సంస్థ నియమ నిబంధనాల మేరకు మానవ హక్కుల పరిరక్షణ కొరకు కృషి చేయాలని ప్రజా సమస్యలు మరియు మానవ హక్కులకు ఎటువంటి సందర్భంలో భంగం వాటిల్లిన ఉల్లంఘన జరిగిన సంస్థ దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించే విధంగా విధులు నిర్వహించాలని బాల్యవివాహాల గురించి పల్లెలలో పట్టణాల్లో అవగాహన కల్పించాలని మరియు అవినీతిరహిత సమాజాన్ని ఏర్పాటు చేసే విధంగా విజిలెన్స్ సెల్ జిల్లా చైర్మన్ గా విధులను క్రమశిక్షణగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సకాలంలో న్యాయం జరిగేలా అధికారుల దృష్టికి వివిధ కమిషన్ల దృష్టికి తీసుకెళ్లి న్యాయ పరిష్కారం చేసే విధంగా విధులను నిర్వర్తించాలని ఆయన తెలిపారు



# రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో పుట్టినరోజు వేడుకలు నిషేధం

## కోదాడ పట్టణ సీఐ శివశంకర్ హెచ్చరిక



**నమస్తే హైదరాబాద్ :** రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వ్యక్తిగత ఉత్సవాలు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని కోదాడ పట్టణ సీఐ శివశంకర్ యువకులకు ఉద్బోధించారు. సోమవారం రాత్రి కోదాడలోని ఓ దాబాలో మిత్రుని పుట్టిన రోజు సందర్భంగా కొందరు యువకులు వేడుక నిర్వహించారు. దాబా బయటకు వచ్చి రోడ్డుపై విచ్చలవిడిగా చిందులేస్తూ అల్లరి చేస్తున్న కొందరు యువకులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. పుట్టిన రోజు వేడుకను ఇంట్లో అమ్మనాన్నలు, తోబుట్టువులతో ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన యువకులను హెచ్చరించారు

# సినిమా




## ఆ హీరోయిన్ అంటే నాకు పిచ్చి.. ఆమెతో నటించాలని ఉంది

సినీప్రియులు అత్యధికంగా ఇష్టపడే సౌత్ హీరోలలో దుల్కర్ సల్మాన్ ఒకరు. ఎన్నో హిట్ చిత్రాల్లో నటిస్తూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ స్టార్ హీరో.. ఇప్పుడు లక్కీ భాస్కర్ సినిమాతో మరో విజయాన్ని అందుకున్నాడు. డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు అడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తుంది. ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా వసూల్లతో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. ఇదెలా ఉంటే.. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న దుల్కర్ సల్మాన్ తన కెరీర్ గురించి కాకుండానే పర్సనల్ లైఫ్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అలాగే తనకు ఓ హీరోయిన్ తో నటించాలని ఉందని వెల్లడించారు.ఆమె మరెవరో కాదు.. బాలీవుడ్ అందాల తార కాజోల్. ఎన్నో హిట్ చిత్రాల్లో కాజోల్ తన పాత్రలకు ప్రాణం పోసిన తీరు ఎంతో అందంగా ఉంటుందని తెలిపాడు దుల్కర్. కాజోల్ పోషించే పాత్రలకు అన్ని భావోద్వేగాలను ప్రేక్షకులు నిజంగా అర్థం చేసుకోగలరని అన్నారు. 'నాకు కాజోల్‌తో నటించాలని ఉంది. ప్రతి సినిమాలో ఆమె పాత్రలను చూపించిన తీరు అద్భుతం. తన పాత్రలకు ఎంత అందంగా జీవం పోస్తుంది. ప్రేక్షకులు తమ ప్రతి కథలోని భావోద్వేగాలను సరిగ్గా అర్థం చేసుకోగలరు. ఆమె నవ్వితే గుండెల్లో నుంచి నవ్వినట్లుగా అనిపిస్తుంది. ఇక ఆమె ఏడ్చే పాత్రలు అదే ఎమోషనల్ రోల్స్ చేస్తే నిజంగానే జరిగిందా అన్నట్లుగా కనిపిస్తుంది. ఆమె పాత్రలను అంత చిత్తశుద్ధితో పోషిస్తుంది ' అన్నారు దుల్కర్ సల్మాన్.దుల్కర్ సల్మాన్ చివరిగా నటించిన చిత్రం లక్కీ భాస్కర్. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ బ్యానర్‌పై ఎస్ నాగ వంశీ, సాయి గ్రియ నిర్మించారు. ఇప్పుడు మరోసారి తెలుగు దర్శకుడితో సినిమా చేస్తున్నాడు దుల్కర్ సల్మాన్. తెలుగులో డెబ్యూ డైరెక్టర్ రవి దర్శకత్వంలో ఓ సినిమాలో నటించబోతున్నాడని, ఈ చిత్రాన్ని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ నిర్మించబోతున్నారని టాక్ నడుస్తుంది. ఈ సినిమాలో పూజా హెగ్డే నటించే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తుంది.



## ఇవి తింటే ఫుల్ ఎనర్జీగా ఉంటారు..! అలసట ఎక్కడికో ఎగిరిపోతుంది..!



పుట్టగొడుగుల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు మన రోగనిరోధక శక్తిని బలంగా చేస్తాయి. శరీరాన్ని హాని చేసే చెడు పదార్థాల నుండి కాపాడి, వ్యాధులను తట్టుకునే శక్తిని ఇస్తాయి. పుట్టగొడుగుల్లో ఉండే సహజ పోషకాలు శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి. దీనివల్ల గుండెకు సంబంధించిన జబ్బులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.బరువు తగ్గాలనుకునే వాళ్ళకు పుట్టగొడుగులు చాలా మంచివి. వీటిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. అందుకే డైటింగ్ చేసేవాళ్ళు వీటిని తినడం మంచిది. ఇవి తిన్న తర్వాత తొందరగా ఆకలి వేయదు. తక్కువ ఆహార పదార్థాల్లో విటమిన్ %ఇ% ఎక్కువగా ఉంటుంది. వాటిలో పుట్టగొడుగులు ఒకటి. ఇది ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం.

పుట్టగొడుగుల్లో విటమిన్ %దీ1, దీ2, దీ3, దీ5, దీ%6 వంటివి చాలా ఉంటాయి. వీటివల్ల శరీర శక్తి పెరిగి, అలసట తగ్గుతుంది. కొన్ని పరిశోధనల ప్రకారం.. పుట్టగొడుగుల్లో క్యాన్సర్ వ్యతిరేక గుణాలు ఉంటాయని భావిస్తున్నారు. ఇవి శరీర కణాలను కాపాడి క్యాన్సర్ రాకుండా నిరోధించగలవు.పుట్టగొడుగులు మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. మెదడు ఆరోగ్యానికి మంచి పోషకాలు వీటిలో ఉన్నాయి. ఇవి జీర్ణవ్యవస్థను బలంగా చేయడంలో ముఖ్యంగా పనిచేస్తాయి. ఫైబర్ ఎక్కువగా ఉండటంతో మలబద్ధకం వంటి సమస్యలు తగ్గుతాయి. వీటిలో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అందుకే షుగర్ ఉన్నవాళ్లకు ఇవి మంచివి. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

ఫైబర్ తో పాటు సెలెనియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉండటం వల్ల పుట్టగొడుగులు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో సహాయపడతాయి. చెడు పదార్థాలు బయటకు వెళ్లే ప్రక్రియను వేగంగా చేస్తాయి. పుట్టగొడుగుల్లో ఉండే విటమిన్లు, మినరల్స్ వల్ల చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది, జుట్టు అందంగా మెరుస్తుంది.పుట్టగొడుగులను రెగ్యులర్ గా ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి శక్తి, మనసుకు ప్రశాంతత, శరీరం శుభ్రంగా ఉండటం అన్నీ కలుగుతాయి. అయితే, శుభ్రంగా ఉంచిన, సరిగ్గా వండిన పుట్టగొడుగులనే తినడం మంచిది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. నిపుణులు అందించిన సమాచారం ప్రకారం ఇక్కడ తెలియజేయడమైనది. ఆరోగ్యరీత్యా ఎలాంటి సమస్యలు ఉన్నానేరుగా వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది)

## మరో నయా ఈవీ స్కూటర్ లాంచ్‌కు బజాజ్ సిద్ధం..



బజాజ్ కంపెనీ జూన్ నెలలో బడ్జెట్ ఫ్రెండ్లీ చేతక్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. బజాజ్ ఆటోకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ కంపెనీ ఆదాయాల సమావేశంలో చేతక్ 2903 మోడల్‌కు అప్‌డేటెడ్ వెర్షన్‌పై కంపెనీ పని చేస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త మోడల్ బజాజ్ ఈవీ అధికారికంగా జూన్‌లో ప్రారంభం కానుందని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం చేతక్ 2903, 3501, 3502, 3503 పేర్లతో నాలుగు వేరియంట్లలో అందుబాటులో ఉంది. క్యూ4లో చేతక్ ఎలక్ట్రిక్ స్కూటర్ విభాగంలో అమ్మకాల చార్టుల్లో అగ్రస్థానంలో నిలిచిన తర్వాత బజాజ్ దాని సరసమైన శ్రేణిని మరింత వైవిధ్యపరచాలని కోరుకుంటోంది. చేతక్ బ్రాండ్‌కు పెరుగుతున్న ప్రజాదరణ నేపథ్యంలో నాలుగో త్రైమాసికంలో భారతదేశ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన విభాగంలో చేతక్‌ను నంబర్ వన్ స్థానానికి చేరింది. బజాజ్ ఈ-స్కూటర్ మార్కెట్‌లో 29 శాతం వాటాను కైవసం చేసుకుంది.బజాజ్ చేతక్ 2903 వెర్షన్ 2.9 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో 123 కి.మీ.ల రేంజ్ తో పనిచేస్తుంది. ఇది 4 గంటల్లో 100 శాతం ఛార్జ్ అవుతుంది. అలాగే ఈ స్కూటర్ గరిష్టంగా 63 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని చెబుతున్నారు. అలాగే ఈ స్కూటర్ హిల్ హెూల్డ్‌తో పాటు రెండు రైడ్ మోడ్‌లను కలిగి ఉంటుంది. ఈ స్కూటర్ ధర ధర రూ. 98,498(ఎక్స్-షోరూమ్) ఉంటుంది. అయితే కొత్త అప్‌డేటెడ్ వెర్షన్ 35 సిరీస్ బ్యాటరీతో 3.5 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీతో 153 కి.మీల పరిధితో వస్తుందని భావిస్తున్నారు. 35 సిరీస్ 3503కు సంబంధించిన ఎంట్రీ-లెవల్ మోడల్ ఆధారంగా కొత్త వేరియంట్ 35 లీటర్ల బూట్ స్పేస్, పెద్ద అండర్-సీట్ స్టోరేజ్, 63 కిలోమీటర్ల వరకు టాప్ స్పీడ్‌ను పొందవచ్చని అంచనా వేస్తున్నారు అలాగే బజాజ్ నయా స్కూటర్ ఇది 3 గంటల 25 నిమిషాల్లో 0 %-% 80 శాతం వరకు ఛార్జ్ అవుతుందని, అలాగే 151 కి.మీ.ల పరిధిని అందిస్తుందని వివరిస్తున్నారు. ఈ స్కూటర్‌లో రెండు రైడ్ మోడ్‌లు ఉంటయి. బజాజ్ చేతక్‌కు సంబంధించిన న్యూ జెనరేషన్ 35 సిరీస్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 3503 ధర రూ. 102,500, 3502 ధర రూ. 122,499, 3501 ధర రూ. 122,500గా ఉంది. ఈ కొత్త అప్‌డేటెడ్ వేరియంట్ ధర రూ. 1 లక్ష లోపు ఉంటుందని భావిస్తున్నారు.

## మాటలు రావడం లేదు..: విరాట్ కోహ్లీ



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (%=జదీ%) తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలిచి చారిత్రక విజయాన్ని నమోదు చేసిన ఆనందం విషాదంగా మారింది. చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన విజయోత్సవ వేడుకల్లో తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందగా, 33 మందికి పైగా గాయపడ్డారు. ఈ ఘటనపై ఆర్‌సిబి స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.సుదీర్ఘకాలంగా ఆర్‌సిబి అభిమానులు ఎదురుచూస్తున్న కలను నిజం చేస్తూ, 18 ఏళ్ల తర్వాత తొలిసారి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకున్న ఆర్‌సిబి జట్టు బెంగళూరు చేరుకోగానే అపూర్వ స్వాగతం లభించింది. చిన్నస్వామి స్టేడియం వద్ద విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. అయితే, ఊహించిన దానికంటే చాలా ఎక్కువ మంది అభిమానులు తరలిరావడంతో పరిస్థితి అదుపుతప్పింది. సుమారు 2 నుంచి 3 లక్షల మంది అభిమానులు గుమిగూడగా, స్టేడియం సామర్థ్యం కేవలం 35,000 మాత్రమే. గేట్ల వద్ద తొక్కిసలాట జరిగి, 11 మంది దుర్మరణం పాలయ్యారు.ఈ విషాద ఘటనపై విరాట్ కోహ్లీ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పందించారు. "మాటలు రావడం లేదు. పూర్తిగా షాక్ అయ్యాను," అని ఆయన రాశారు. ఆర్‌సిబి విడుదల చేసిన అధికారిక ప్రకటనను కూడా ఆయన తన పోస్ట్‌లో షేర్ చేశారు. "బెంగళూరులో జరిగిన ఈ దురదృష్టకర సంఘటనల గురించి మీడియా నివేదికల ద్వారా తెలుసుకుని మేము తీవ్ర ఆవేదన చెందుతున్నాం. ప్రజల భద్రత, శ్రేయస్సు మాకు అత్యంత ముఖ్యం. ప్రాణాలు కోల్పోయిన వారికి ఆర్‌సిబి సంతాపం తెలియజేస్తుంది. ప్రభావిత కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం. ఈ పరిస్థితి గురించి తెలిసిన వెంటనే, మేం మా కార్యక్రమాన్ని వెంటనే మార్చుకుని, స్థానిక అధికారుల మార్గదర్శకత్వం, సలహాలను పాటించాం. మా మద్దతుదారులందరూ దయచేసి సురక్షితంగా ఉండాలని కోరుతున్నాం," అని ఆర్‌సిబి తమ ప్రకటనలో పేర్కొంది.

Printed published and owned by Godishala Somaiah published from # 15-76,Medipally, Ghatkesar,Ranga reddy,Dist,Printed at Sri SehaSai Printers,IDA BalaNagar, Hyderabad,Editor : Godishala Somaiah,email:nhnews24@gmail.com,ph 9912580066,RNI APTEL/2012/45237..